'వార్త'కు స్పందన

బోరు మోటర్ పైప్ లైన్ సరి చేసి, పిచ్చి మొక్కలు తొలగింపు

పిచ్చి మొక్కలను తొలగించిన దృశ్యం

అక్కన్నపేట, మార్చి 13, ప్రభాతవార్త : ఇటీవల పారిశుధ్యానికి నోచుకోని గొల్లపల్లి గ్రామం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి సర్పంచ్ గుడాల లావణ్య రవి స్పందించారు. శుక్రవారం గ్రామంలో బోరు మోటర్ పైప్‌లైన్ సరి చేయించి, రోడ్డు ఇరువైపులా పిచ్చి ఉన్న మొక్కలు తొలగించారు. అలాగే ప్లాస్టిక్ వాడకం ద్వారా ఆరోగ్యం ఎలా హానిజరుగుతుందో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి స్వాతి, ఉప సర్పంచ్ శ్రీను, వార్డ్ మెంబర్లు ఉన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

ఉత్తమ పట్టు రైతులకు జిల్లా స్థాయి అవార్డులు

చిన్నకోడూరు, మార్చి 13,ప్రభాతవార్త :
కేంద్ర పట్టు పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని బోదాన్ పోచంపల్లిలో జరిగిన పట్టు కృషి మేళాలో జిల్లాలోని ఉత్తమ పట్టు రైతులకు జిల్లాస్థాయి అవార్డులను అందజేసి శాలువాలతో సత్కారించారు. ఉత్తమ రైతులుగా పిల్లి సునీత, బొగ్గుల వనజ, రాగుల లక్ష్మీ, వాణిలు జిల్లా స్థాయి అవార్డులు అందుకున్నారు. ఉత్తమ చాకి సెంటర్ నిర్వాహకుడిగా పెద్దోళ్ల నరసింహులు అవార్డు అందుకున్నారు. కారయనక్రమంలో పట్టు పరిశ్రమశాఖ జాయింట్ డైరెక్టర్ లత, శాస్త్రవేత్తలు వినోద్‌కుమార్, రాఘవేంద్రరావు, భువన తదితరులు పట్టు సాగులోని మెలకువలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సీడిలు, ప్రోత్సాహకాలను, పంట దిగుబడితో వచ్చే లాభాలను వివరించారు. అనంతరం ఉత్తమ పట్టు రైతులు వారిని సత్కారించారు. కార్యక్రంలో పట్టు పరిశ్రమ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా సహాయ సంచాలకులు ఇంద్రసేనారెడ్డి, అధికారులు ఐలయ్య, మల్లేశం, జిల్లాల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రం

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

జిల్లాలో 82 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్న 15,358 విద్యార్థులు

పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 14 నుంచి 16వ వరకు నిర్వహించ తలపెట్టిన టెన్త్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో పకడ్బంధీగా ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 82 పరీక్ష కేంద్రాలలో ఏర్పాటు చేశారు. 82 పరీక్ష కేంద్రాలలో 15,358 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష నిర్వహించనున్నారు. రెగ్యులర్ బాలురు 7700, బాలికలు 7637, ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు 14 మంది పరీక్షలు రాయనున్నారు. వోకేషన్ విద్యార్థుల్లో బాలురు 890, బాలికలు 872 మొత్తం 1762 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్ష సమయం తర్వాత 5 నిమిషాల వరకు విద్యార్థులు పరీక్ష కేంద్రంలోకి చేరుకోవడానికి సడలింపు ఇచ్చారు. పోలీసు స్టేషన్‌కు 8 కిలోమీటర్ల దూరం ఎక్కువ ఉన్న 9 సీ కేటగిరి సెంటర్లలో 9 మంది డిప్యూటీ తహసీల్దార్లు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేకంగా విధులు నిర్వహించనున్నారు. 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున ఏర్పాటు చేశారు. ఫిజిక్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలు 9.30 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నారు. 24 స్టోరేజ్ కేంద్రాలు, 82 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 82 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఏడుగురు రూట్ ఆఫీసర్లను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలోకి సెల్‌ఫోన్, చేతి గడియారం, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకరావొద్దని అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రంలోని పిఎస్‌రూంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే పరీక్షా కేంద్రాల సమీపంలో 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేస్తున్నారు.

ఆల్ ది బెస్ట్ చెప్పిన హరీష్‌రావు

నేటి నుంచి ప్రారంభం అయ్యే టెన్త్ పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అల్ ది బెస్ట్ చెప్పారు. సిద్దిపేట నియోజకవర్గంతోపాటు జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని అకాంక్షించారు. విద్యార్థుల బంగారు భవిష్యత్ పునాది పదో తరగతేనని తెలిపారు. అమ్మనాన్నల ఆశయాలను,ఉపాధ్యాయుల సంకల్పాన్ని నెరవేర్చాలన్నారు. ఏకాగ్రతతో పరీక్షలు రాసి అద్భుతమైన ఫలితాలు సాధించాలని ఆయన కోరారు.

'వార్త'కు స్పందన

పల్లె దవాఖాన మరమ్మతు చేయించిన సర్పంచ్

దవాఖానాలో తలుపులు, కిటికీ అద్దాలు సరి చేయించిన దృశ్యం

అక్కన్నపేట, మార్చి 13, ప్రభాతవార్త : మండలంలోని మల్లంపల్లి గ్రామంలోగల పల్లె దవాఖానాలో ఉన్న సమస్యలపై ఇటీవల 'ప్రభాతవార్త'లో 'ప్రారంభం కాకముందే కూలుతున్న పల్లె దవాఖానా' శీర్షికతో వచ్చిన కథనానికి సర్పంచ్ మేక ఇస్తేరా కొమరయ్య స్పందించారు. కథనం వెలువడిన వెంటనే సర్పంచ్ దవాఖానాను పరిశీలించిన పాడైపోయిన తలుపులు, కిటికీ అద్దాలు, నల్లాలకు మరమ్మతు చేయించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో పల్లె దవాఖానా సౌకర్యాలను సరిచేయించినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా సవరణను త్వరగా పూర్తిచేయాలి

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

సంగారెడ్డి మున్సిపాలిటీ, మార్చి 13, ప్రభాతవార్త: ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో ఎస్ఐఆర్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా మ్యాపింగ్ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించాలన్నారు. సూపర్‌వైజర్లు,ఏఈఆర్‌ఓలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఒకే వ్యక్తి పేరుతో రెండుచోట్ల ఓటు నమోదు కాకుండా జాబితాను జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపారు. రాజకీయ పార్టీల ద్వారా బూత్‌లెవల్ ఏజెంట్లను నియమించడంతోపాటు బీఎల్‌ఓలకు ఐడీకార్డులు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. మృతి చెందిన ఓటర్ల వివరాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సమావేశంలో పాల్గొన్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి లోపాలు లేకుండా సమర్థవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ సవరణ ప్రక్రియలో మంచి పురోగతి సాధిస్తున్నామని, ఇదే ఉత్సాహంతో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని అధికారులకు సూచించారు. డీఎస్ఈ పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. జిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు సూపర్వైజర్లు, బీఎల్‌ఓలు సమన్వయంతో పనిచేయాలని, మండల స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, ఆర్డీఓ రాజేందర్, ఈఆర్ఓ పటాన్ చెరువు అంబదాస్ రాజేశ్వర్, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

వంట గ్యాస్ కొరతలేదు

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావిణ్య

సంగారెడ్డి బ్యూరో, మార్చి 13, ప్రభాతవార్త :
జిల్లాలో గృహావసరాలకు వినియోగించే ఎల్‌పిజి సిలిండర్లకు ఎక్కడా కొరత లేదని, నిరంతరం అధికారులు పర్యవేక్షిస్తూ, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎల్పిజి గ్యాస్ సరఫరాపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎల్‌పిజి గ్యాస్ కొరత ఉందన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవంలేదని, ప్రజలు అపోహలకు గురికాకూడదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని బాట్లింగ్ ప్లాంట్లలో ఎక్కడా గ్యాస్ కొరత నమోదు కాలేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 810 ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుండగా, మొత్తం కోటి 29 లక్షల ఎల్‌పిజి కనెక్షన్లు ఉన్నాయని, రోజుకు సగటున 2.5 లక్షల సిలిండర్లు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అయితే అపోహల కారణంగా ప్రస్తుతం బుకింగ్స్ 72 శాతం వరకు పెరిగినట్లు పేర్కొన్నారు. గృహ వినియోగదారులతోపాటు ఆసుపత్రులు, విద్యాసంస్థలు, వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధాన్యత క్రమంలో గ్యాస్ సరఫరా కొనసాగుతుందని మంత్రి తెలిపారు. అపోహలను ఆసరాగా చేసుకుని గ్యాస్ నిల్వచేయడం, మళ్లించడం, బ్లాక్ మార్కెటింగ్ చేయడం వంటి చర్యలకు ప్రభుత్వం కఠినంగా స్పందిస్తుందని హెచ్చరించారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 288 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పరిస్థితులను పర్యవేక్షించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. జిల్లాల వారీగా కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు, సరఫరా పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకు ఒకసారి, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకసారి మాత్రమే ఎల్‌పిజి బుకింగ్‌చేయాలని వినియోగదారులకు సూచించారు. అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేయకుండా అపోహలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఆయిల్‌ఫామ్ సాగుపై దృష్టి సారించి లక్ష్యాలను సాధించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కట్టెల పొయ్యిపై ప్రసాదం తయారు చేస్తున్న దృశ్యం

ఏడుపాయల్లో తప్పని కట్టెల పొయ్యి

లడ్డూ ప్రసాదానికి తాకిన గ్యాస్ మంటలు...

ఒకరోజు నిలిచిపోయిన ప్రసాద తయారీ...

పాపన్నపేట, మార్చి 13, ప్రభాతవార్త : ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికా యుద్ధ మంటలు ఏడుపాయల లడ్డూ ప్రసాదానికి తాకాయి. గ్యాస్ సిలిండర్లు దొరకక మూడు రోజుల నుంచి పొయ్యి వెలగ లేదు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు వారం రోజులుగా దొరకడం లేదు. దీంతో గురువారం భక్తులకు అమ్మవారి ప్రసాదం కరువైంది. చివరకు కట్టెల పొయ్యి రాజేసి, శుక్రవారం లడ్డు పులిహోర తయారు చేసి భక్తులకు అందించారు. వివరాల్లోకి వెళ్తే... తెలంగాణలోనే ప్రసిద్ధి గాంచిన ఏడుపాయల్లో, దుర్గమ్మ ప్రసాదంగా లడ్డూ, పులిహోర విక్రయిస్తారు. లడ్డు రూ.20, పులిహోర రూ.10కి అమ్ముతుంటారు. ప్రతి రోజు ఎంత లేదన్నా రూ. 70 నుంచి రూ.80 వేల ప్రసాదం అమ్ముడవుతుంది. ఆదివారం రోజైతే ప్రసాదం ద్వార రూ.2 లక్షలకు పైగా ఆదాయం వస్తుంది. ఇందుకోసం కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు వాడుతుంటారు. నెలకు 80 నుంచి 100 గ్యాస్ సిలిండర్లు, అవసరమవుతాయి. మొదట్లో రూ. 2019 ఉన్న కమర్షియల్ గ్యాస్ వాడుతుంటారు. నెలకు 80 నుంచి 100 గ్యాస్ సిలిండర్లు అవసరమవుతాయి. మొదట్లో రూ.2019 ఉన్న కమర్షియల్ గ్యాస్ సిలిండర్,యుద్ధం తర్వాత రూ.2133కు చేరాయి. ఇపుడు అవి కూడా దొరకడం లేదు.దీంతో ఏడుపాయల్లో గత ఆదివారం తయారు చేసిన ప్రసాదం,బుధవారం వరకు అందు బాటులో ఉంది. గురువారం మాత్రం భక్తులకు ప్రసాదం అందలేదు. దీంతో మట్టి పొయ్యి నిర్మించి, కట్టెల మంట ద్వార లడ్డు ప్రసాదం తయారు చేయించి, భక్తులకు అందజేసినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

గ్రామ సభలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

ఖాజాపూర్‌లో భూభారతి రీసర్వే గ్రామసభ

సిర్గాపూర్, మార్చి 13, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామంలో శుక్రవారం భూ భారతి రీ సర్వే గ్రామ సభను నిర్వహించారు. కార్యక్రమానికి సబ్ కలెక్టర్ ఉమా హారతి హాజరై రైతులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. రెవిన్యూ పైలెట్ ప్రాజక్టు కింద ఖాజాపూర్ గ్రామం ఎంపికయిందన్నారు. గ్రామంలోని 134 సర్వే నంబరు, 1432 ఎకరాల భూగోళి విస్తీర్ణంలోని పట్టా, ప్రభుత్వ భూములపై చర్చించామని సబ్ కలెక్టర్ ఉమా హారతి పేర్కొన్నారు. రైతులు వివరాలు సరిచూసుకోవలన్నారు. భూ సమస్యలు పరిష్కరించే దిశగా భూ భారతి భూ రీ సర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు. కబ్జాలో ఉన్న రైతులను గుర్తించి సర్వే ప్రకారంగా భూ హక్కుదారుడిగా రికార్డులో నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. భూ రీసర్వేతో రైతు కష్టాలకు చెక్ పడుతుందని జిల్లా ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వేయర్ భిక్షపతి తెలిపారు. ఖాజాపూర్ గ్రామానికి రెవిన్యూ నక్షా లేదని, త్వరలోనే సర్వే పూర్తి చేసి వివరాలను ఆన్‌లైన్ చేస్తామన్నారు. రైతులు ఎక్కడున్నా తమ భూమి వివరాలను తెలుసుకోవచ్చన్నారు. కబ్జాలో ఉన్న భూములకు ఎలాంటి ధోకా ఉండదని రైతులకు భరోసా చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సర్పంచ్ తనిఖీ

అక్కన్నపేట, మార్చి 13, ప్రభాతవార్త : అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సర్పంచ్ కోడాముంజ బాలరాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లతో సర్పంచ్, పిల్లలకు సరైన సమయానికి స్నాక్స్, భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే కేంద్రానికి ప్రతిరోజూ ఎంతమంది పిల్లలు హాజరవుతున్నారు, వారికి ఎలా బోధిస్తున్నారో కూడా తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది మరియు చిన్నారులు ఉన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

అడిషనల్ కలెక్టర్ పాండు

సంగారెడ్డి, మార్చి 13 ప్రభాతవార్త : యువత మత్తు పదార్థాల బారిన పడకుండా పటిష్టమైన చర్యలతో జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ పాండు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో కలిసి నార్కోటిక్స్ కోఆర్డినేషన్ (ఎన్‌సిఓఆర్‌డి) జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ,యువత మాదకద్రవ్యాల రవాణా చేసినా, వినియోగించినా ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయన్నారు. డ్రగ్స్ నియంత్రణకు జిల్లాలోని అన్ని కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మాదకద్రవ్యాల అలవాటుకు ఎవరూ బానిసలు కావొద్దని, ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అర్బన్, రూరల్ అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, బస్ స్టాండ్లు, డ్రగ్స్ వినియోగానికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో డ్రగ్స్, గుడుంబా తదితర మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. కళాశాలల్లో ఏర్పాటు చేసిన డ్రగ్స్ నిరోధక కమిటీలు పటిష్టమైన నిఘాతో పనిచేయాలన్నారు. సమావేశంలో డ్రగ్స్ నిరోధానికి వివిధ కళాశాలలు, వివిధ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో గీతం యూనివర్సిటీ, మహేశ్వర మెడికల్ కళాశాల, ఎమ్మెన్నార్ విద్యా సంస్థలు, వోక్సెన్ యూనివర్సిటీ ప్రతినిధులు, డీడబ్ల్యువో, డీసీహెచ్ఎస్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ, ఆర్టీసీ, వ్యవసాయ, విద్యాశాఖ అధికారులు, ఆటో యూనియన్ ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పాండు

నర్సాపూర్‌లో విజిలెన్స్ దాడులు

46 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం.. పలువురిపై కేసులు నమోదు

సిలిండర్‌లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

నర్సా పూర్ మార్చి 13, ప్రభాతవార్త : గ్యాస్‌కొరత ఉందన్న అపోహల నేపథ్యంలో శుక్రవారం నర్సా పూర్‌లో సివిల్ సప్లై విజిలెన్స్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. దాడుల్లో గృహావసరాల నిమిత్తం వాడుకునే గ్యాస్ సిలిండర్లను వ్యాపార వాణిజ్య అవసరాల కోసం వాడుకుంటున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు సివిల్ సప్లై విజిలెన్స్ దాడులు జరపగా ఈ దాడుల్లో 46 గృహవసరాల గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా హెచ్‌పి గ్యాస్ గోదామును సందర్శించి పరిశీలించారు. అనంతరం విజిలెన్స్ అండ్ సివిల్ సప్లై డిఎస్‌పి వెంకటేశం మాట్లాడుతూ దేశంలో గ్యాస్ కొరత ఉందన్న పుకార్లు వస్తున్నందున నర్సా పూర్‌లో దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో గృహవసరాల గ్యాస్ సిలిండర్లను వాణిజ్యవ్యాపారస్తుల అవసరాలకు వాడుకుంటున్నట్లు నిర్ధారణ అయినట్లు తెలిపారు. ఇందుకుగాను 46 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెంకటేశం తెలిపారు నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్యాస్ వినియోగదారులు గ్యాస్ కొరత ఉందన్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆయన తెలిపారు వినియోగదారులు లేనిపోనీ అపోహాలను నమ్మరాదని ఆయన తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పండరీ, ఎస్సైలు వెంకటేశ్వర్లు, సాంబశివరావు మెదక్ ఏఎస్‌ఓ నిసార్ డిప్యూటీ తహసీల్దార్ నాగరాజ్, ఆర్ఐ నర్సింలు ఉన్నారు.

సాగునీటి కోసం రైతుల ఆందోళన

చిన్నకోడూరు, మార్చి 13,ప్రభాతవార్త : రైల్వే అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. వేసిన పంట పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని శుక్రవారం రైల్వేబ్రిడ్జి వద్ద పనులను నిలిపివేసి రైతులు ఆందోళన చేపట్టారు. మండల పరిధిలోని గంగాపూర్ రైతులు వరి పంటను సాగు చేశారు. ఎండలు ముదురుతుండడంతో పంటకు సాగునీరు అందడంలేదు మూడేళ్లుగా రంగనాయకసాగర్ ఎడమ కాలువ నుంచి సాగునీరు వచ్చేదని తెలిపారు. విఠలాపూర్-గంగాపూర్ మధ్య రైల్వే బ్రిడ్జి నిర్మించడం వల్ల పొలాలకు సాగునీరు అందించే కాలువను ధ్వంసం చేశారని తెలిపారు. రైల్వే అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని చెప్పారు. రైల్వే అధికారులు కాలవ పనులు ప్రారంభించకపోతే రైల్వే పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, చిన్నకోడూరు ఎస్ఐ చంద్రమోహన్ రైతు వద్దకు చేరుకొని శాంతింపజేశారు. జిల్లా కలెక్టర్ హైమావతి స్పందించి కాల్వ పనులు నిర్మించి సాగునీరు అందేలా రైల్వే అధికారులను ఆదేశించాలని రైతులు కోరుతున్నారు. కార్యక్రమంలో రైతులు పిట్ల పరుశరాములు, గుండెల్లి వేణు, రామస్వామి, శేఖర్, దేవయ్య, అంతయ్య, కిష్టయ్య, నర్సయ్య, నారాయణ, రాజు, లక్ష్మయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదు

వీడియో కాన్ఫరెన్స్‌లో సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హైమావతి. చిత్రంలో డిఎస్ఓ తనూజ

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
జిల్లాలో ఎలాంటి ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ఇప్పటివరకు వినియోగదారులకు సరైన సమయానికి గ్యాస్ డెలివరీ చేస్తున్నామని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి తెలిపారు. రాష్ట్రంలో ఎల్‌పిజి గ్యాస్ సరఫరాపై వినియోగదారులు గందరగోళం చెందుతున్న దృష్ట్యా రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, పౌర సరఫరాలశాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలిసి శుక్రవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆమె డిఎస్ఓ తనూజ, వివిధశాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలైన గురుకుల విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, అనాథశరణాలయాలు, వృద్ధాశ్రమాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎల్‌పిజి గ్యాస్ సరఫరా చేస్తున్నామని వివరించారు. జిల్లాలో రబీ సీజన్‌లో సాగునీరు సరఫరాకు అటం కాలు లేకుండా చూస్తున్నామన్నారు. రబీ సీజన్‌లో పండిన పంటల కొను గోలుకు ప్రణాళిక ప్రకారం ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ గోపి కృష్ణ, సిద్దిపేట ఆర్డీఓ సదానందం, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

కొరత రాకుండా వంట గ్యాస్ సరఫరా చేయాలి

సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:
గృహావసరాలకు, కేజీబీవీలు గురుకులాలు, సంక్షేమ వసతిగృహాలు, అసుపత్రులు, అనాధ శరణాలయాలు, వృద్ధాశ్రమాలకు కొరత రాకుండా వంట గ్యాస్ సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి గ్యాస్ డీలర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఎల్‌పిజి గ్యాస్ డీలర్లు, సంబంధితశాఖల అధికారులతో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఎల్‌పిజి గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేదని ఇక ముందు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వంట గ్యాస్ సరఫరా చేయాలన్నారు. యుద్ధవాతావరణంలో ఇతర దేశాల నుంచి ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ఇంధనం దిగుమతి చేసుకొని సరఫరా చేస్తుందన్నారు. గ్యాస్ స్టాక్,డెలివరీ రిజిస్టర్ ఖచ్చితంగా మెయింటైన్ చేయాలన్నారు. రెవెన్యూ, సివిల్‌సప్లై, విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేస్తారని తెలిపారు. గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఒక గ్యాస్ సిలిండర్ తేడా వచ్చిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిఎస్ఓ తనూజ, డిఈవో శ్రీనివాస్ రెడ్డి, డిఅండ్‌హెచ్ఓ ధనరాజ్ పాల్గొన్నారు.

ప్రజలు ఆందోళన చెందొద్దు

ప్రభుత్వం జిల్లాకు అవసరమైన వంట గ్యాస్ సరఫరా చేస్తుందని ప్రజలెవరూ వంట గ్యాస్ కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు. జిల్లాలో 03 లక్షల 32 వేల 850 డిమెస్టిక్ వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని 1500 కమర్షియల్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. ఎక్కువ సిలిండర్లు బుక్ చేసుకోవడం మూలంగానే ఇబ్బందులు వస్తాయని వంట గ్యాస్ విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కమర్షియల్ వంట గ్యాస్ సైతం సరఫరా చేస్తామన్నారు.

లారీ ఢీకొని భర్త మృతి

భార్య, కొడుకుకు గాయాలు

జోగిపేట, మార్చి 13,(ప్రభాతవార్త): వెనకనుంచి వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో ఒక వ్యక్తి మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిధలోని అల్మాయిపేట వద్ద శుక్రవారం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. టేక్మాల్ మండలం సాంగ్య తాండకు చెందిన కేతావత్ మాన్‌సింగ్ (26) భార్య కవిత, కొడుకు దినేష్‌లతో కలిసి బైకుపై సంగారెడ్డి నుంచి గ్రామానికి వెళ్తున్న సందర్భంలో, వెనుకనుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో మాన్‌సింగ్‌కు అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా భార్య కవిత, కొడుకు దినేష్‌లకు గాయాలయ్యాయి. వీరికి జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు జోగిపేట ఎస్ఐ తెలిపారు.

20 ట్రాక్టర్ల ఇసుక చోరీ.. కేసు నమోదు

చౌటకూరు, మార్చి 13 (ప్రభాతవార్త): మండల పరిధిలోని వెండికోల్ గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన ఇసుకను తహసీల్దార్ ఆర్ఐ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. అందులో నుంచి 20 ట్రాక్టర్ల ఇసుకను గ్రామానికి చెందిన మహేష్, సాయి, రాజేష్ తీసుకు వెళ్లినట్లు సమాచారం ఉండడంతో ఈ ముగ్గురిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ ఎమ్మార్వో అనుదీప్, ఆర్ఐ ప్రమోద్ తెలిపారు.

కొమురవెల్లి మల్లన్న 28 రోజుల హుండి ఆదాయం లెక్కింపు

హుండీలను లెక్కిస్తున్న దృశ్యం

కొమురవెల్లి, మార్చి 13, ప్రభాతవార్త:
మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామి 28రోజుల హుండీ ఆదాయం శుక్రవారం ఆలయ ఆవరణలో లెక్కించారు. 28 రోజులకు గానూ రూ.1,20,29,945 నగదు, 89 గ్రాముల మిశ్రమ బంగారం, 6 కిలలో వంద గ్రాముల మిశ్రమ వెండి, విదేశీ కరెన్సీ 34 నోట్లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.కృష్ణప్రసాద్, ఇన్స్‌పెక్టర్ పి.విజయలక్ష్మీ, అధికారులు బుద్ధి శ్రీనివాస్, సుదర్శన్, చంద్రశేఖర్, స్థానాచార్యులు మల్లయ్య, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఉత్సవ కమిటీ సభ్యులు గంగం నర్సింహ్మారెడ్డి, ఎల్లయ్య, మల్లేశం, సత్యనారాయణ, సిబ్బంది, అర్చకులు, స్వర్ణకారుడు నర్సింహాచారి, టిజిబి బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి బోనాల పండుగ

అల్లాదుర్గం, మార్చి 13, ప్రభాతవార్త:
అల్లాదుర్గం మండల పరిధిలోని బహిరిన్ దిబ్బ గ్రామంలో వెలిసిన ప్రసిద్ధ లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయంలో శుక్రవారం భక్తులు బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు బోనాలు గ్రామ పురవీధుల గుండా డప్పు చప్పుళ్ళు, మంగళ వాయిద్యాలు, భజనలతో లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి చేరుకొని స్వామివారికి ఐదు ప్రదక్షిణలు చేసి స్వామివారికి బోనాల మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల పండుగను తిలకించడానికి గ్రామస్తులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాంపాడు వీరప్ప, మాజీ సర్పంచ్ కోర్మోని ప్రభు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

జహీరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:
జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందుకు ఇటీవల మున్సిపల్ వార్డులకు ఎన్నికైన కౌన్సిలర్లు, మున్సిపల్ కమీషనర్ జైత్రామ్, మున్సిపల్ సిబ్బంది, పట్టణ ప్రముఖులు పాల్గొని ఇఫ్తార్ విందును ఆరగించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

-తహసీల్దార్ మాలతి

చిన్నశంకరంపేట, మార్చి 13, ప్రభాతవార్త:
విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తహసీల్దార్ మాలతి సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేటలోని కెజిబివి పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలుసూచనలు చేశారు. నిత్యం రుచికరమైన వంటలను చేయాలన్నారు. పది పరీక్షలు నేటి నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఏకాగ్రతతో చదవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపల్ గీత, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు

చిన్నశంకరంపేట, మార్చి 13, ప్రభాతవార్త:
మండలపరిధి ఖాజాపూర్‌లోని పెద్దమ్మతల్లి దేవాలయ ఐదో వార్షికోత్సవాలు వైభవంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం పెద్దమ్మతల్లి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కలు చెల్లించుకున్నారు.

ఆశావర్కర్లకు కనీసవేతనం రూ.18వేలుగా నిర్ణయించాలి

వినతిపత్రం అందజేస్తున్న కడారి నాగరాజుతోపాటు ఆశాకార్యకర్తలు

నర్సాపూర్, మార్చి 13, ప్రభాతవార్త:
అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ఆశావర్కర్లకు కనీసవేతనం రూ.18000 నిర్ణయించాలని డిమాండ్‌చేశారు. శుక్రవారం నర్సాపూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆశాకార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసినవారిలో సిఐటీయు జిల్లాఉపాధ్యక్షులు కడారి నాగరాజుతోపాటు ఆశ యూనియన్ అధ్యక్షులు శ్యామల నాయకులు మంజుల పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం

-ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ఇంచార్జ్ ఎ.శ్రీనివాస్

ప్లాస్టిక్‌వ్యర్థాలను సేకరించిన వాలంటీర్లు విద్యార్థులు, కళాశాల ప్రతినిధులు

నర్సాపూర్, మార్చి 13, ప్రభాతవార్త:
గ్రామస్తులమందరం కలిసి ప్లాస్టిక్‌భూతాన్ని తరిమి వేయాలని అదేవిధంగా గ్రామంలో ఏర్పాటుచేసిన ఎన్ఎస్ఎస్ శిబిరంతో గ్రామస్తుల్లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెంచిందని ఎన్ఎస్ఎస్ యూనిట్2 ఇంచార్జ్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలోని జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ యూనిట్2 ఆధ్వర్యంలో హన్మంతపూర్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. ఈశిబిరం గ్రామంలో 7రోజుల కొనసాగుతుంది. ఈ మేరకు ఎన్ఎస్ఎస్ శిబిరం యూనిట్ 2 ఇంచార్జ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలన పై దృష్టిసారించి, గ్రామ పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, గ్రామస్తులలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ఇంచార్జ్ అధికారి శ్రీనివాస్‌తో పాటు కౌన్సిలర్ నర్సమ్మ, డాక్టర్ రమేష్ హేమంత్‌కుమార్, రాజు, మహేందర్‌రెడ్డి, రాములు, రవి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకై ప్రజలకు ఉచిత సేవలు

-ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

సిర్గాపూర్, మార్చి 13, ప్రభాతవార్త:
శుక్రవారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు సాయిసంగమేశ్వర్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కడపల్‌గ్రామానికి చెందిన శేఖర్ ఆచార్య పూర్వవిద్యార్థి బేగరి శ్రీజ వివాహాన్ని పురస్కరించుకుని పుస్తెమెట్టెలు అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సాయిసంగమేశ్వర్, జోనల్ చైర్మన్ రాజ్‌కుమార్, డిసి చంద్రశేఖర్ ఆచార్య, సభ్యులు వెంకట్‌రావు, అంజిరెడ్డి, రవికుమార్, మల్లేశం ముదిసిర్, యూసఫ్, బసవ చైతన్య, కడపల్ మాజీ ఎంపిటిసి సభ్యులు పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ గోడ కూల్చివేతపై వివాదం

-రాళ్లకత్వలో ఉద్రిక్తత
-రాజకీయ అండతోనే కూల్చివేత జరిగిందని ఆరోపణ
-న్యాయం చేయాలని బాధితుడి వినతి

కూల్చేసిన ప్రహరీ గోడ దృశ్యం

జిన్నారం, మార్చి 13, ప్రభాతవార్త:
సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లకత్వ గ్రామంలో ఓ వ్యక్తి ఇంటి ప్రహరీగోడ కూల్చివేత స్థానికంగా చర్చనీయాంశమైంది. గ్రామానికిచెందిన ఎంబరి మహేష్‌యాదవ్ తన సొంతస్థలంలో నిర్మించుకున్న ప్రహరీ గోడను కొందరు వ్యక్తులు కూల్చివేశారని ఆరోపించారు. మహేష్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికిచెందిన ముసరి ప్రభు, కుమార్ అనే వ్యక్తులు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా వచ్చి ప్రహరీ గోడను కూల్చివేశారని పేర్కొన్నారు. ఈఘటన వెనుక స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారుల అండదండలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. న్యాయబద్ధంగా తనకుచెందిన స్థలంలో గోడ నిర్మించుకున్నప్పటికీ కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాల్సిన అధికారులే కూల్చివేతకు సహకరించారని గ్రామస్థులు కూడా అంటున్నారు. ఈఘటనపై సమగ్రవిచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకోవాలని, న్యాయంచేయాలని బాధితుడు ఉన్నతాధికారులను కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినవారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్‌చేస్తున్నారు.

రైతుల ఖాతాల్లో పిఎం కిసాన్ సమ్మాన్ నిధి

జగదేవ్‌పూర్, మార్చి 13, ప్రభాతవార్త:
అర్హులైన రైతులందరికీ పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా ప్రధానమంత్రి శుక్రవారం సాయంత్రం రైతుల ఖాతాల్లోకి డబ్బులు విడుదల చేశారని జగదేవ్‌పూర్ మండల వ్యవసాయాధికారి యు.వసంతరావు అన్నారు. ఈఘట్టాన్ని మండల రైతులు మండల పరిధిలోని మునిగడప రైతు వేదికలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు కేంద్రప్రభుత్వం అందిస్తున్న పథకాల ప్రయోజనాలను, పిఎం కిసాన్ పథకం రైతుల ఆర్థిక స్థిరత్వానికి కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

గజ్వేల్ టౌన్, మార్చి 13, ప్రభాతవార్త:
కుమ్మర ఆడపడుచు, రామాయణ రచయిత్రి, తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతిని శుక్రవారం గజ్వేల్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సంగాపూర్ రోడ్డులోగల మొల్లమాంబ విగ్రహానికి గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే

పటాన్‌చెరు, మార్చి 13, ప్రభాతవార్త:
ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ గ్రామంలోగల శ్రీవేణుగోపాల స్వామి దేవాలయం వార్షికోత్సవ కార్యక్రమంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. నూతన దేవాలయాల నిర్మాణాలకు సహకారం అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి శ్రీశైలంయాదవ్, సీనియర్ నాయకులు నరేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చిన్న రాములు, కౌన్సిలర్లు వెంకటేష్, ఆంజనేయులు, నాగభూషణం, గ్రామ, పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌ను ప్రారంభించిన సర్పంచి

ఉన్నతపాఠశాలలో టేబుల్ టెన్నిస్‌ను ప్రారంభిస్తున్న సర్పంచి ఆదర్శ్

వెల్దుర్తి, మార్చి 13, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన వెల్దుర్తిలోని జడ్పిహెచ్ఎస్‌లో శుక్రవారం టేబుల్ టెన్నిస్‌ను గ్రామ సర్పంచి ఆదర్శ్, ఉపసర్పంచి శ్రావణ్ ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయుల వెంకటస్వామి, నరసింహారెడ్డి, శ్రీనివాసరావు, చార్లెస్, సునీత, రాధిక, రాము, శాంతి పాల్గొన్నారు.

చైతన్యం ద్వారానే మోసాలను అరికట్టవచ్చు

-డిఎస్ఓ తనూజ

ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంలో డిఎస్ఓ తదితరులు

సిద్దిపేట రూరల్, మార్చి 13, ప్రభాతవార్త:
చైతన్యం ద్వారానే మోసాలను అరికట్టవచ్చునని డిఎస్ఎ తనూజ అన్నారు. ప్రపంచ వినియోగాదురుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో సివిల్ సప్లై విభాగం ఆధ్వర్యంలో వినియోగదారుల చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్ఎ తనూజ పాల్గొని మాట్లాడారు. మార్కెట్‌లో విక్రయించే ఉత్పత్తుల భద్రత, నాణ్యత ప్రమాణాలపై వినియోగదారులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. వినియోగదారులు కొనుగోలు చేసే ప్రతి వస్తువుపై తయారీ తేదీ గడువు తేదీ తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. వినియోగదారులు చెల్లించిన ప్రతి రూపాయికి సరైన ప్రతిఫలం పొందే హక్కు ఉన్నప్పటికీ అనేక నష్టపోతున్నారని తెలిపారు. కన్స్యూమర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కుంభాల రవీందర్, జిల్లా సెక్రటరీ గుర్రాల శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కొలతల అధికారి శివరంజని, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జయరాం, సివిల్ సప్లై అధికారులు శ్రీనాథ్, శ్రీలత, అసోసియేషన్ ప్రతినిధులు ముత్యం, వెంకటలక్ష్మీ,హెచ్‌పి డీలర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సతీష్, డీలర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు

పెద్దశంకరంపేట, మార్చి 13, ప్రభాతవార్త:
స్థానిక తిరుమలాపూర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం నుండి వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ, వాస్తుపూజ, ఆవాహిత దేవతాహవనం, జలాధివాసం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శనివారం దేవతాహోమం, శాంతి పౌష్టికా హవనం, ఆదివారం అమ్మవారి విగ్రహప్రతిష్ఠ, యంత్రప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, సోమవారం బోనాల ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త విగ్రాం రాజన్‌గౌడ్ తెలిపారు.

హెచ్ఎంలకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించాలి

చిన్నశంకరంపేట, మార్చి 13, ప్రభాతవార్త:
కేంద్రప్రభుత్వం మార్చి నెల చివరి వారం నుండి నిర్వహించే జనగణన సర్వేలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించాలని ప్రాథమిక పాఠశాలల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం చిన్న శంకరంపేటలో మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సర్వేలలో ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలకు అనుభవం ఉందని, జనగణన సర్వేలో ప్రత్యేక బాధ్యతలను అప్పగిస్తే సర్వేను విజయవంతంగా పూర్తి చేస్తామన్నారు.

ఎఐ వల్ల ఉద్యోగాలు మరిన్ని వస్తాయి

-గీతం కాంక్లేవ్‌లో అభిప్రాయపడ్డ పరిశ్రమ నిపుణులు

పటాన్‌చెరు, మార్చి 13, ప్రభాతవార్త:
కృత్రిమ మేధస్సు(ఎఐ) విస్తృత వినియోగం వల్ల తొలి దశలో కొన్ని ఉద్యోగాలు పోయినా, ముమ్ముందు మరిన్ని అందుబాటులోకి వస్తాయని పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడ్డారు. 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 8.5 కోట్ల ఉద్యోగాలను ఏఐ స్థానభ్రంశం చేయవచ్చని, అదే సమయంలో 9.7 కోట్ల కొత్త ఉద్యోగాలు అందుబాటులో వస్తాయని అంచనా వేశారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని కెరీర్ గైడెన్స్ సెంటర్ (సిజిసి) ఆధ్వర్యంలో భవిష్యత్తును ఇంజనీరింగ్ చేయడం, ప్రధానరంగాలలో ఆవిష్కరణలు అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన మూడవదఫా ఇండస్ట్రీ కాంక్లేవ్ విజయవంతంగా ముగిసింది. రానున్నరోజులలో ఉద్యోగమార్కెట్ విస్తరిస్తూనే ఉంటుందని, అయితే ఏఐ ఆధారిత యుగానికి తగిన నైపుణ్యాలను విద్యార్థులు సమకూర్చుకోవాలని నిపుణులు సూచించారు. ఈసందర్భంగా ప్యానలిస్టులు గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్‌లోని అత్యాధునిక ప్రయోగశాలలు, మౌలిక సదుపాయాలను సందర్శించారు. తొలుత, గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డిఎస్‌రావు స్వాగతోపన్యాసం చేయగా, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి సూచించారు. సిజిసి అసిస్టెంట్ మేనేజర్ కె.వాసుదేవ్ వందన సమర్పణతో ఈకార్యక్రమం ముగిసింది. ఇందులో సిజిసి డైరెక్టర్ డాక్టర్ కె.మమతారెడ్డి, కోర్ ఇంజనీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

-నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల వినూత్న ప్రచారం

కరపత్రాలను పంచుతూ వినూత్న ప్రచారం చేస్తున్న నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం

నర్సాపూర్, మార్చి 13, ప్రభాతవార్త:
విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి తమ ఉజ్వల భవిష్యత్తును ఏర్పరుచుకోవాలని చెబుతూ నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు శుక్రవారం వినూత్న ప్రచారాన్ని నిర్వహించారు. నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా.కె.హుస్సేన్ మార్గదర్శకత్వంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ సమీరా నజ్మీన్, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఆదెప్ప ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు తదితరులు కలిసి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష చివరిరోజున స్థానిక పరీక్షాకేంద్రాలను ఏకకాలంలో సందర్శించి వినూత్న ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులకు నర్సాపూర్ డిగ్రీ కళాశాల ప్రాముఖ్యతను తెలియజేసే కరపత్రాలను పంచుతూ తమ కళాశాలలో గల వివిధకోర్సులు, వసతులు, అత్యున్నతప్రమాణాలు, అర్హత, నైపుణ్యత, బోధనానుభవంగల అధ్యాపకులు కలిగి ఉన్నారని తెలియజేస్తూ ప్రచారం చేశారు. తమకళాశాలలో తప్పక ప్రవేశం పొందాలని ఇంటర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమములో అధ్యాపకులు డా.రమేష్, డా.బి.సురేష్‌కుమార్, హేమంత్‌కుమార్, మహేందర్‌రెడ్డి, ప్రభాకర్, పృధ్వి, వాలంటీర్లు కళ్యాణ్, కార్తీక్, ప్రభాకర్ పాల్గొన్నారు.

పశువుల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

-జిల్లా పశుసంవర్ధక అధికారి వెంకటయ్య

నర్సాపూర్, మార్చి 13, ప్రభాతవార్త:
నర్సాపూర్ మండల పరిధిలోని కాజీపేట గ్రామంలో పశుసంవర్ధక శాఖ నోవార్టీస్ నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరంలో గ్రామంలోని 34పశువులకు గర్భకోశవ్యాధుల చికిత్సలు 4పశువులకు కృత్రిమ గర్భధారణ 28పశువులకు సాధారణ చికిత్సలు, 44 దూడలకు నట్టలనివారణ మందులు వేయడం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటయ్య హాజరై మాట్లాడుతూ పశువుల వ్యాధుల పట్ల రైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా వ్యాధి పశువులకు సోకినట్లు అనుమానంవస్తే సంబంధిత పశువైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జనార్దన్‌రావు, డాక్టర్లు సౌమిత్‌కుమార్, స్వప్న, ప్రియాంక, ఫరీనా, గ్రామ సర్పంచి దొంతి యాదగిరిగౌడ్, నోవార్టీస్ నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ ప్రతినిధులు, పాడి రైతులు, పశుసంవర్ధక జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఆంజనేయులు, సిబ్బంది వెంకటేష్, ఏసుప్రభు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పదవతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

వెల్దుర్తి, మార్చి 13, ప్రభాతవార్త:
మండలంలోని ఎద్దులపల్లి ఉపసర్పంచి శ్రీనివాస్‌గౌడ్ బండపోసానిపల్లి జడ్పిహెచ్ఎస్‌లో పరీక్షలు రాస్తున్న పదోతరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు రాసే సమయంలో విద్యార్థులు ప్రశాంతంగా ఉండాలని, సమయాన్ని గంట ముందుగా పరీక్షాకేంద్రానికి వెళ్లాలని సూచించారు. మంచి ఫలితాలు సాధించి మన గ్రామానికి పాఠశాలకు మంచి పేర్లు తీసుకురావాలని రాబోయే రోజుల్లో విద్యా విషయంలో ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తాను ముందు ఉంటానని మంచిఫలితాలు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు పడిగే దాసు. బండపూసలపల్లి మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, ఎద్దులపల్లి మాజీ సర్పంచ్ భూములు, నాయకులు ఇంద్రసేనారెడ్డి, గణేష్‌గౌడ్‌తో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల ఆర్థికాభివృద్ధికి 409 యూనిట్ల లక్ష్యం

-జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి, మార్చి 13, ప్రభాతవార్త:
తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న షెడ్యూల్డ్ కులాల కార్యాచరణ ప్రణాళిక 2025–26లోభాగంగా సంగారెడ్డి జిల్లాకు బ్యాంకు సంబంధిత స్వయం ఉపాధిపథకాల కింద 409యూనిట్లు మంజూరు చేయనున్నట్లు జిల్లాకలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఇందుకు రూ.821లక్షల ఆర్థికసహాయం అందించనుండగా, జిల్లాలోని 409 కుటుంబాలకు ఈ పథకాల ద్వారా లబ్ధి చేకూరనుంది. ఈ పథకాల ద్వారా లబ్ధిదారులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి వారి ఆర్థికస్థితిని మెరుగుపరచడం ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. జిల్లా లక్ష్యాలు ఇలా ఉన్నాయి: ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాలు – 257 యూనిట్లు మూడు చక్రాల వాహనాలు (సరుకు/ప్రయాణికులరవాణా) – 125 యూనిట్లు సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్, వ్యవసాయ సంబంధిత పరికరాలు – 27 యూనిట్లు మొత్తం – 409 యూనిట్లు. అర్హతలు: కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణప్రాంతాల్లో రూ.1,50,000లోపు, పట్టణప్రాంతాల్లో రూ. 2,00,000 లోపు ఉండాలి. రవాణా పథకాల కోసం 01.07.2025 నాటికి 21నుండి 50సంవత్సరాల మధ్యవయస్సు ఉండాలి. వ్యవసాయ ఆధారిత పథకాల కోసం 21 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి. సోలార్ యూనిట్ పథకం కోసం కనీసం 2 ఎకరాల భూమి ఉండడంతోపాటు బోరుబావిలో నీరు ఉండాలి. అవసరమైన పత్రాలు: ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం (మీసేవా ద్వారా), కుల ధృవీకరణ పత్రం (తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తీసినది), రవాణా పథకాల కోసం శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, వ్యవసాయ పథకాల కోసం పట్టాదారు పాస్ పుస్తకం, సోలార్ యూనిట్ కోసం బోరుబావిలో నీరు ఉన్నట్లు పంచాయతీ కార్యదర్శి ధృవీకరణ, దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో జతపరచాలి. ద్విచక్ర వాహనాల పథకం వంటి సేవల్లో పనిచేస్తున్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని కలెక్టర్ తెలిపారు. ఇతర నిబంధనలు: ఒకకుటుంబంలో ఐదేళ్లలో ఒకరికి మాత్రమే స్వయం ఉపాధిపథకం మంజూరు చేస్తారు. దళిత బంధు పథకం లబ్ధిదారులు ఈ పథకానికి అర్హులు కారని తెలిపారు. నైపుణ్యం, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని,రవాణా పథకాల కోసం డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి అని చెప్పారు. మొత్తం లక్ష్యంలో దివ్యాంగులకు 5శాతం, మహిళలకు 33 శాతం కేటాయింపు ఉంటుందని వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు మార్చి 17 నుండి మార్చి 24, 2026 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

నేటి నుండే పది పరీక్షలు..

సర్వం సిద్ధం చేసిన అధికారులు..

పాపన్నపేట, మార్చి 13, ప్రభాతవార్త:
నేటి నుండే జరుగనున్న పది పబ్లిక్ పరీక్షల నిర్వహణకు మండల విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. పదో తరగతి పరీక్షలు మార్చి 16వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయి. మండలంలోని పది జిల్లా ఉన్నత పాఠశాలతోపాటు ఒక కస్తూరిబా పాఠశాలలోని 550 విద్యార్థినీవిద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా, 6సెంటర్లలో పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. కాగా మండలంలో 310మంది విద్యార్థులు, 240మంది విద్యార్థినులు వివిధ ప్రభుత్వ పాఠశాలల నుండి హాజరు కానున్నారు. కేంద్రాలలో త్రాగు నీటివసతితోపాటు ఫ్యాన్లు, మరుగుదొడ్లు, వైద్యసేవలు అందించనున్నట్లు విద్యాధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

పరీక్షాకేంద్రాల వద్ద 163సెక్షన్...
పరీక్షాకేంద్రాల వద్ద ఉదయం 9నుండి 1గంట వరకు 162సెక్షన్ ఏర్పాటుచేయనున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. పరీక్షాకేంద్రాల వద్ద గట్టి పోలీసుబందోబస్తు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో మంచి ఫలితాలు సాధించాలి

-డాక్టర్ దేశబోయిని నర్సింహులు

గజ్వేల్ టౌన్, మార్చి 13, ప్రభాతవార్త:
పదవ తరగతి వార్షిక పరీక్షలు నేటి నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థిని, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి విజయం సాధించాలని జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింహులు సూచించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ శనివారం నుండి పరీక్షలు ప్రారంభం కానుండగా మీరు కష్టపడి చదివిన దానిని ఇష్టంతో రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. పదవ తరగతి మీ బంగారు భవిష్యత్తుకు పునాదిలాంటిదని, పరీక్షలు బాగా రాసి మీ తల్లిదండ్రులకు, గ్రామానికి, మీరు చదివిన పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

-మండల విద్యాధికారి ఉదయభాస్కర్‌రెడ్డి

ములుగు, మార్చి 13, ప్రభాతవార్త:
నేటినుండి ప్రారంభంకానున్న పదవతరగతి వార్షికపరీక్షలు నిర్వహించడానికి సర్వం సిద్ధంచేయడం జరిగిందని మండల విద్యాధికారి ఉదయభాస్కర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 12 పాఠశాలలకు చెందిన 542 మంది విద్యార్థినీ విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్ష సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే రావాలని తెలిపారు. ప్రతి విద్యార్థి సమయాన్ని వృధా చేయకుండా ఏ ప్రశ్నకు జవాబు ముందుగా తెలిస్తే ఆ జవాబులు రాసి మిగతా వాటిని తర్వాత రాయాలని సూచించారు.

పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

వెల్దుర్తి, మార్చి 13, ప్రభాతవార్త:
మండలంలోని వెల్దుర్తి జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలతోపాటు కుకునూరు జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, శుక్రవారం కుక్కునూరు జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో హాల్ టికెట్ నెంబర్ వేస్తున్న చీఫ్ సూపరింటెండెంట్ బి.సాంబయ్య, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ సిద్ది రామగౌడ్ తెలిపారు. వెల్దుర్తిలో విద్యార్థుల హాల్ టికెట్ నెంబర్స్ కేటాయిస్తున్న చీఫ్ సూపర్ డిపార్ట్మెంటల్ ఆఫీసర్ సంతోష్‌కుమార్లు కాగా శనివారం జరిగే పరీక్షలకు అన్నీ సిద్ధంచేస్తున్నట్లు తెలిపారు. కాగా స్థానిక మండలవిద్యాధికారి బుచ్చనాయక్ పాఠశాలలను పరిశీలించారు. మండలంలో కుక్కునూరు ఉన్నతపాఠశాలలో 72మంది విద్యార్థులు, 77మంది విద్యార్థినులు, మొత్తం 150మంది పరీక్షలు రాస్తున్నట్లు వారు తెలిపారు. అలాగే జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో 125 మంది విద్యార్థులు, 124మంది విద్యార్థినులు మొత్తం 239మంది పరీక్షలు రాయన్నట్లు తెలిపారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

చిన్నశంకరంపేట, మార్చి 13, ప్రభాతవార్త:
పది పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ దీప్లారాథోడ్ తెలిపారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో ఆయన మాట్లాడుతూ... నేటి నుండి ప్రారంభమయ్యే పది పరీక్షలకు మండల వ్యాప్తంగా 477 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, మూడుకేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. విద్యార్థులు ఉదయం ఎనిమిది గంటల లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, కేంద్రాలలో విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించినట్లు ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాపన్నపేట, మార్చి 13, ప్రభాతవార్త:
మండల పరిధిలోని నార్సింగి ఫీడర్పై పనులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఇ నర్సింలు తెలిపారు. ఉదయం 11గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

చిన్నశంకరంపేట, మార్చి 13, ప్రభాతవార్త:
మండలపరిధి గవ్వలపల్లికి చెందిన శ్రీనివాస్ ఇటీవల ప్రమాదవశాత్తు నీటిలోపడి మృతిచెందాడు. బాధితుడు గతంలో ఎస్బిఐబ్యాంకులో పిఎంజెజెబివై, పిఎంఎస్బిఐ బీమాపథకాలు చేశాడు. మృతుని నామినీగా ఉన్న పుష్పకు శుక్రవారం ఎస్బిఐ బ్యాంక్‌మేనేజర్ సుధీర్ రూ.4లక్ష రూపాయలు చెక్కును అందించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది నాగరాజు, మమత, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : సర్పంచ్

కొమురవెల్లి, మార్చి 13, ప్రభాతవార్త : మహిళలు సొంత కాళ్లపై నిలబడేలా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని సర్పంచ్ అక్కెనపల్లి రాజ్యలక్ష్మీమల్లారెడ్డి అన్నారు. మండల పరిధిలోని రామ్‌సాగర్‌లో వివో(మహిళా సమాఖ్య) భవన నిర్మాణ పనులు, రూ.10 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులకు శుక్రవారం ఆమె భూమి పూజ చేసి ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో ఎంపి నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకరావడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎసిరెడ్డి మల్లారెడ్డి, వార్డు సభ్యులు,వివో అధ్యక్షులు, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

తుంగ, పూడిక తొలిగించే పనులు ప్రారంభం

కాలువలో తుంగ, పూడికను తొలిగిస్తున్న దృశ్యం

నంగునూర్, మార్చి 13, ప్రభాతవార్త : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు ఆదేశాల మేరకు శుక్రవారం నంగునూర్ మండలంకు వెళ్లే ప్రధాన నీటి కాలువలో తుంగ, పూడిక తొలిగించే పనులను అధికారులు ప్రారంభించారు. నంగునూర్ మండలానికి సాగునీరు వెళ్లే ప్రధాన కాలువల్లో తుంగ,పూడిక పేరుకుపోయి రైతులకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించడంతో అధికారులు స్పందించి లాంగ్ భూం మిషన్ ఏర్పాటుచేసి తుంగను, పూడికను తొలగిస్తున్నారు. తుంగ, పూడిక తొలిగించడంతో రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందనుంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో

సమానంగా బేసిక్ వేతనం చెల్లించాలి : నరసింహ

మాట్లాడుతున్న ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ

సంగారెడ్డి మున్సిపాలిటీ, మార్చి 13, ప్రభాతవార్త: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా బేసిక్ వేతనం చెల్లించాలని, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎంఎ రహమాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎం నరసింహ మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతినెలా సక్రమంగా జీతాలు అందడంలేదని ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి కార్పొరేషన్ ద్వారా ఉద్యోగులకు జీతాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పి వెంకటరాజ్యం, డిపిఓల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిద్ధార్థ ఏఐటియూసీ జిల్లా కార్యదర్శి వెంకట్రాజ్యం పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎంఎ రెహమాన్, అధ్యక్షుడు సయ్యద్ ఖాసిం ఇర్ఫాన్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా పూజారి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా భానుచందర్, పద్మ, శివ ప్రధాన కార్యదర్శిగా చల్లా వాసు, సహాయ కార్యదర్శిగా కొత్తపల్లి చంద్రశేఖర్, అబ్దుల్ ఫహీం, అంజి బాబు, సుధాకర్ ముదిరాజ్, జాన్, లింగం,అభిమన్యు, సయ్యద్ పాషా, సరస్వతి,మమత తదితరులు పాల్గొన్నారు

ఆలయ నిర్మాణానికి రూ.1,01,116 విరాళం

సహాయం అందించిన మంజులరెడ్డిని సత్కరిస్తున్న స్వాముల దృశ్యం

కోహెడ, మార్చి 13, ప్రభాతవార్త : మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయానికి సామాజిక సేవకురాలు, కాంగ్రెస్ నాయకురాలు కర్ణాకంటి మంజులరెడ్డి రూ.1,01,116 విరాళంగా అందజేశారు. శుక్రవారం ఆలయ నిర్మాణం, ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగస్వాములవుతూ ఆమె ఆలయాన్ని సందర్శించి అయ్యప్ప సేవా సమితి ట్రస్ట్ సభ్యులకు ఈ విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా మంజులరెడ్డి మాట్లాడుతూ కోహెడలో హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణం చేపట్టి ఈ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన అయ్యప్ప సేవా సమితి ట్రస్ట్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి ట్రస్ట్ సభ్యులు, మంజులక్క యువసేన సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్ డే వేడుకలు

గజ్వేల్, మార్చి 13 (ప్రభాతవార్త): పట్టణంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో అంతర్జాతీయ ల్యాబ్ టెక్నీషియన్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్ మహేందర్ ఆధ్వర్యంలో ఆసుపత్రి సిబ్బందితో కలిసి కేక్ కట్‌చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ రోగ నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకమన్నారు. రోగులకు వేగవంతమైన, ఖచ్చితమైన వైద్యసేవలు అందించడంలో నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ వేడుకల్లో జిల్లా ఆసుపత్రికి చెందిన ల్యాబ్ టెక్నీషియన్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో కేక్ కట్ చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

మర్కుక్, మార్చి 13 (ప్రభాతవార్త): ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అంగడికిష్టాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పలు సంక్షేమపథకాలను అమలు చేస్తోందన్నారు. పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుద్దెడ రాములుగౌడ్, పార్టీ గ్రామ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కనకయ్య గౌడ్, చేబర్తి సర్పంచ్ ర్యాకం యాదగిరి, మాజీ సర్పంచ్‌లు కప్పర భానుప్రకాష్‌రావు, శ్యాంసుందర్, ఉపసర్పంచ్ సుదర్శన్, నాయకులు మల్లేష్‌గౌడ్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్రాడ్యుకేషన్ సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేస్తున్న తూంకుంట నర్సారెడ్డి

విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి...

మర్కుక్, మార్చి 13(ప్రభాతవార్త): విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం అంగడికిష్టాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయడానికి పలు కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అంగడికిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతకుముందు విద్యార్థులు చేసిన పలునృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటరాములు, ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ, సర్పంచ్ కొండల్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు దుద్దెడ రాములుగౌడ్, శ్యాంసుందర్, కప్పర భానుప్రకాష్‌రావు, ఉప సర్పంచ్ సుదర్శన్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కనకయ్య, చేబర్తి సర్పంచ్ ర్యాకం యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కన కయ్యగౌడ్, గ్రామఅధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, నర్సన్నపేట అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు మల్లె శంగౌడ్, రవి, మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెగా జాబ్ డ్రైవ్ విజయవంతం

సంగారెడ్డి బ్యూరో మార్చి 13, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భాగంగా, డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో మహీంద్రా మహీంద్రా ట్రాక్టర్స్, జహీరాబాద్‌లో 800కు పైగా ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన మెగా జాబ్ డ్రైవ్ విజయవంతమైంది.మొత్తం నమోదులు: 756 1వ రౌండ్ టెలిఫోనిక్ ఇంటర్వ్యూలో ఎంపిక: 295 జాబ్ డ్రైవ్‌లో హాజరైనవారు: 125 ఆఫర్ లెటర్స్ అందుకున్నవారు: 78..ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా అభ్యర్థులకు మెషినింగ్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ వంటి సాంకేతిక విభాగాల్లో క్వాలిటీ మరియు లైన్ సపోర్ట్ విభాగాల్లో నిర్వహించారు,ఈ సందర్భంగా, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఐఐసి) చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ఎంపికైన అభ్యర్థులను అభినందించారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం కావడంతో, సదాశివపేట, జహీరాబాద్, సంగారెడ్డిలో జరగనున్న జాబ్ డ్రైవ్‌లలో పాల్గొనడానికి డీఈఈటీలో నమోదు చేసుకోవాలని ఉపాధి నిమిత్తం ఉన్న యువతను ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, సంగారెడ్డి వనిత సంతోష్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్, సంగారెడ్డి తుల్జ నాయక్, జనరల్ మేనేజర్, డిఐసి, సంగారెడ్డిడాన్ లెవిస్, హెడ్, స్కిల్ డెవలప్‌మెంట్, మహీంద్రా మహీంద్ర వి.ఎస్.రామ్, ప్లాంట్ హెడ్, జహీరాబాద్ ప్లాంట్, మహీంద్రా మహీంద్రా పి. వంశీధర్ రెడ్డి, డీఈఈటీ డాక్టర్ ఎం. చంద్రశేఖర్, డీఈఈటీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : సర్పంచ్

చిన్నకోడూరు, మార్చి 13,ప్రభాతవార్త : పౌష్టికాహారంతో పాటు క్రీడలు, చిన్నారులను ఎంతో అభివృద్ధి చేస్తాయని సర్పంచ్ కూర మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గోనెపల్లిలో శుక్రవారం మండల పరిధిలోని గోనెపల్లిలో గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల మేళా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో పిల్లల్లో దాగి ఉన్న మేధాశక్తిని బయటకు తీయడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శంకరాయకుంట సర్పంచ్ మాకు మహేష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ భాగ్య, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, సిఆర్‌పి మౌనిక,రజిత, అంగన్‌వాడీ టీచర్లు తిరుమల, శ్యామల, అఫ్రీనా, సుజాత, భాగ్యలక్ష్మీ, వార్డులు సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రంగంపేటలో వసతిగృహ వార్షికోత్సవం

కొల్చారం మార్చి 13 ప్రభాతవార్త : మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేట ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహంలో వార్షికోత్సవ కార్యక్రమాన్ని వసతిగృహ అధికారి పరశురాం అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ఉపసర్పంచ్ చిట్కుల సురేష్, అరిగే విజయ్‌కుమార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా విన్యాసాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వసతిగృహ అధికారి పరశురాం, ప్రధానోపాధ్యాయుడు ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తున్నదని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు, గురువులు, పాఠశాల మరియు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అరిగే విజయ్ కుమార్, యోగా శిక్షకుడు అజయ్, ఉపాధ్యాయుడు నరేష్ చారి, సిబ్బంది యాదయ్య, నారా గౌడ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

మర్కుక్, మార్చి 13 (ప్రభాతవార్త): మండల పరిధిలోని శివారువెంకటాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. జిల్లా కలెక్టర్‌గా సిహెచ్.ఇందు, డీఈవోగా సిహెచ్.కనకలక్ష్మి, ఎంఈవోగా బి.లాస్య, ప్రధానోపాధ్యాయురాలిగా కె. కారుణ్య, ఉపాధ్యాయులుగా వర్షిని, ఝాన్సీ,మైథిలి, శ్రావణి, కావ్య, మనోజ్, కార్తిక్, అనిల్, రాఘవేందర్, భాస్కర్, హారిక, అక్షయ వ్యవహరించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూచిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని, జీవిత లక్ష్యాన్ని ఏర్పర్చుకొని ఆ లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు ఇష్టంతో చదువుతూ తల్లిదండ్రులకు, సమాజానికి మంచి గుర్తింపు తీసుకురావాలని పేర్కొన్నారు. స్వయం పరిపాలన దినోత్సవంలో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కొత్త నరసింహారెడ్డి, తుమ్మ కుమార్, మధు, ముత్తయ్య, సృజన, పద్మజ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మండల విద్యాధికారి ఉమారాణి

టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి : ఎంఇఒ

కొల్చారం మార్చి 13 ప్రభాతవార్త : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మండల విద్యాధికారి ఉమారాణి తెలిపారు. కొల్చారం మండలంలోని రంగంపేట, కొల్చారం ప్రాంతాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 2026లో నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల కోసం మండలంలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో మొత్తం 690 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు.పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు మరియు ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకుని ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్సీసీ సిబ్బంది సంపత్, రాజశేఖర్, రాములు, ఉపాధ్యాయులు, పీడీ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందోలులో పది పరీక్ష కేంద్రాల పరిశీలన

జోగిపేట, మార్చి 13,(ప్రభాతవార్త): అందోలు మండలంలో పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు మండల విద్యాధికారి క్రిష్ణ తెలిపారు. మండల పరిధిలో మొత్తం ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 998 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయన తెలిపారు. మండలంలోని అందోలు సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలలో 187 మంది, అందోలు జడ్పీహెచ్ఎస్‌లో 170మంది,జోగిపేట సెయిర్ డాన్‌బాస్కో పాఠశాలలో 176 మంది. ఎస్ఆర్ఎం కళాశాలలో 168మంది, జోగిపేట జడ్పీహెచ్ఎస్‌లో 184మంది, నేరెడిగుంట జడ్పీహెచ్ఎస్‌లో 113మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. కాగా శుక్రవారంనాడు పరీక్షా కేంద్రాలను పరిశీలించి విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని పరీక్షా కేంద్రాల నిర్వాహకులకు సూచించారు.

వాటర్ ట్యాంకును శుభ్రం చేసిన మున్సిపల్ సిబ్బంది

జోగిపేట, మార్చి 13,(ప్రభాతవార్త): ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని వాటర్ ట్యాంకును మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. అందోలులోని యుఎల్ఎస్ఆర్ ట్యాంకును బ్లీచింగ్ పౌడర్ వేసి శుభ్ర పరిచారు. మున్సిపల్ కమీషనర్ రవీందర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మున్సిపల్ ఏఇఇ శ్రీకాంత్, వర్క్ ఇన్స్‌పెక్టర్ మహేందర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో భారీ ఇఫ్తార్ విందు

హాజరైన మాజీ డిప్యూటీ సిఎం మహమూద్ అలీ

పటాన్‌చెరు, మార్చి 13,ప్రభాతవార్త : గంగా, జమున, తెహజీబ్ సంస్కృతికి ప్రతీక తెలంగాణ రాష్ట్రమని మాజీ ఉప ముఖ్యమంత్రి మహమ్మద్ అలీ అన్నారు. శుక్రవారం సాయంత్రం జీఎంఆర్ కన్వెన్షన్‌లో ఎమ్మెల్యే జీఎంఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మహమ్మద్ అలీతో పాటు, శాసనమండలి మాజీ ప్రొటెం చైర్మన్ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ.. ముస్లింల అభివృద్ధికి మాజీ సిఎం కేసీఆర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో అన్ని మతాలకు సమ ప్రాధాన్యతనిస్తూ గొప్ప సెక్యులర్ వాదిగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నిలిచిపోతున్నారని అభినందించారు. సొంత నిధులతో మసీదులు, దర్గాలు నిర్మించడం అభినందనీయమన్నారు. పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇరాన్ ఇజ్రాయిల్ అమెరికా యుద్ధం ముగిసిపోయేలా అల్లాను ప్రార్థించాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో పుష్కలంగా వర్షాలు కురిసి ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించాలని కోరారు. నియోజకవర్గంలో కులం మతం ప్రాంతాలకు అతీతంగా పరమత సహనం పెంపొందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

రోస్టర్ విధానాన్ని పునః పరిశీలించాలి

క్యాస్ట్ సర్టిఫికెట్లలో మాల పేరు స్పష్టంగా నమోదు చేయాలి..జాతీయ మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య

హుస్నాబాద్ రూరల్, మార్చి 13, ప్రభాతవార్త : హుస్నాబాద్‌లో జాతీయ మాల మహానాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరె కిశోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, వెన్న రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడి అంజయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రమోషన్లలో అమలవుతున్న రోస్టర్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే పునర్ పరిశీలించాలని డిమాండ్‌చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న రోస్టర్ పాయింట్ల విధానం వల్ల మాల విద్యార్థులు, మాల ఉద్యోగులు నష్టపోతున్న పరిస్థితి నెలకొన్నదని, గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో మాలలకు జారీ చేసిన కుల ధృవీకరణ పత్రాల్లో (కాస్ట్ సర్టిఫికెట్లు) కులం పేరు స్పష్టంగా లేకపోవడం సమస్యగా మారిందని,ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం వచ్చినప్పటికీ ఇప్పటివరకు కాస్ట్ సర్టిఫికెట్లలోగానీ, మీ సేవల్లోగానీ మాల అనే పేరు కనిపించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మాలల హక్కులను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ప్రమోషన్లలో అమలవుతున్న రోస్టర్ విధానాన్ని పునర్ సమీక్షించాలని, మాలలకు న్యాయం జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, కుల ధృవీకరణ పత్రాల్లో మాలకులం పేరు స్పష్టం గా నమోదు చేయాలని, మీ సేవలో మాల కులం వివరాలు సరిగా చూపించేలా మార్పులు చేయా లని, విద్యార్థులు, ఉద్యోగులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వ విధానాలు రూపొందించాలని, ఈ అంశంపై ప్రభుత్వం వెంటనే స్పందించి మాల సమాజానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా అధ్యక్షులు జాల శ్రీనివాస్, సైదాపూర్ మండల నాయకులు విరంగి సాయి, హుస్నాబాద్ జై భీమ్ సైనిక దళ్ అధ్యక్షులు దుండ్రా సుమన్, హుస్నాబాద్ మండల నాయకులు సుంకె రమేష్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మేడి అంజయ్య

నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు

హత్నూర మార్చి 13, ప్రభాతవార్త : పదవ తరగతి పరీక్షల నిర్వహణకు హత్నూర మండలంలో అధికారులు అవసరమైన చర్యలు తీసుకున్నారు. మండలంలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాట్లుచేసినట్లు మండల విద్యాధికారి వెంకట నరసింహులుగౌడ్ తెలిపారు. హత్నూరాలోని ఉన్నత పాఠశాలలో 183, గురుకుల పాఠశాలలో 278, దౌల్తాబాద్ ఉన్నత పాఠశాలలో 220, ప్రైవేటు పాఠశాలలో 320 మంది చొప్పున పరీక్షలు రాయనున్నారని ఆయన తెలిపారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎంఈవో

అక్కన్నపేట, మార్చి 13, ప్రభాతవార్త : మండలంలోని అంతకపేట, గౌరవెల్లి గ్రామాలలో పదవ తరగతి పరీక్ష కేంద్రాలను మండల విద్యాధికారి గుగులోత్ రంగానాయక్ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా గౌరవెల్లిలో 85 మంది, అంతకపేట 125 మంది, మొత్తం 210 మంది విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన సీటింగ్, నంబరింగ్ విధానాన్ని పరిశీలించారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు.

హుస్నాబాద్‌లో శానిటేషన్ డ్రైవ్

హుస్నాబాద్ రూరల్, మార్చి 13, ప్రభాతవార్త : 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మున్సిపల్ చైర్పర్సన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో స్ప్రే చేయడం, ఆయిల్ బాల్స్ వేయడం, బ్లీచింగ్ చల్లడం వంటి చర్యలు చేపట్టారు. అలాగే చెత్తను తడి-పొడిగా విభజించి ఇవ్వడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రైడే-ఫ్రైడే" కార్యక్రమాన్ని నిర్వహించి దోమల నివారణ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ విప్ కాశబోయిన రమేష్, కౌన్సిలర్లు చెన్నబోయిన అనూష విద్యాసాగర్, బూరుగు లతకిష్టస్వామి, తిరుపతి, రాజు, గడిపె సంపత్, సావుల మంజుల,పూదరి వరప్రసాద్, బొల్లి శ్రీనివాస్, గదపాక రవీందర్, వాల సుప్రజనవీన్‌రావు, స్వరూపతో పాటు మున్సిపల్ అధికారులు, బేసిల్ ఫౌండేషన్ సభ్యులు, మెప్మా రిసోర్స్‌పర్సన్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుతాం

మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందనరవీందర్

గజ్వేల్, మార్చి 13 (ప్రభాతవార్త): ప్లాస్టిక్ రహిత పట్టణంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, కమిషనర్ వెంకటగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు కౌన్సిలర్ మన్నె రూప వెంకటేష్ ఆధ్వర్యంలో తడిచెత్త పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగిశెట్టి చందన రవీందర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గజ్వేల్‌లోని ఇందిరా పార్కు చౌరస్తా వద్ద కళాజాత బృందంచే తడి, పొడి, హానికర చెత్తపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం పట్టణ శివారులో ఉన్న డిఆర్‌సిసి కంపోస్టు యార్డును సిడిఎంఎ రాజేశ్వర్‌రావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుంటుకు లక్ష్మి శ్రీనివాస్, కాముని మురళి, బొగ్గుల స్వప్న సురేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, వివిఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : మాజీ ఎమ్మెల్యే

గజ్వేల్, మార్చి 13 (ప్రభాతవార్త): మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మాజీఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి మున్సిపల్ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ ఎర్రవల్లిలో కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు అంజద్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం నర్సారెడ్డి మాట్లాడుతూ మైనార్టీ డిక్లరేషన్ హామీ మేరకు సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో దశల వారీగా వివిధ పథకాలను అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. మైనార్టీ వర్గాల్లోని పేదల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసి నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, స్థానిక కౌన్సిలర్లు నాయిని సత్యలక్ష్మి యాదగిరి, గుంటుకు లక్ష్మిశ్రీనివాస్, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రమేష్, ఉపేందర్‌రెడ్డి, నక్క సంతోష రాములుగౌడ్, వివిఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, మండల మాజీ మైనార్టీ అధ్యక్షుడు అజ్గర్, సుఖేందర్ రెడ్డి, జంగం రమేష్‌గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, రాజేశం పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం రాంపూర్ గ్రామ అధ్యక్షుడిగా ప్రశాంత్

కొల్చారం మార్చి 13 ప్రభాతవార్త : మండల పరిధిలోని రాంపూర్ గ్రామ ముదిరాజ్ సంఘం గ్రామ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గ్రామ అధ్యక్షుడిగా కుడిచనం ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా జంగిడి కృష్ణను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కార్యదర్శిగా బాలరాజ్, కోశాధికారిగా మంద సోమశేఖర్, సలహాదారులుగా పోచయ్యలను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ రాంపూర్ గ్రామంలోని ముదిరాజ్ కులస్తులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. పెద్దమ్మ తల్లి వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్నిరంగాల్లో ముదిరాజులు ముందుండాలని పిలుపునిచ్చారు.అనంతరం పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నెల్లి రాజు సంగమేశ్వర్, గ్రామస్తులు రాజు, సాయిరాం, రాము, యాదగిరి, నాగరాజ్, మధు, రవి తదితర ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి శిశు మందిర్ పాఠశాల వార్షికోత్సవం

కొల్చారం మార్చి 13 ప్రభాతవార్త : మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేట గ్రామంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో వార్షికోత్సవ కార్యక్రమాన్ని పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగంపేట పీఠాధిపతి శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు హాజరైన వారిని ఆకట్టుకున్నాయి. అనంతరం మాధవానంద సరస్వతి స్వామి మాట్లాడుతూ శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలు విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థుల్లో పెంపొందించే కేంద్రాలుగా నిలుస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఆచార్యులు నవీన్ కుమార్, నాయకులు అరిగే విజయ్ కుమార్, పాఠశాల కమిటీ అధ్యక్షులు కామిని శ్రీనివాస్, బుద్ధుల రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టాయిలెట్ల సమస్య పరిష్కరించిన సర్పంచ్

అక్కన్నపేట, మార్చి 13, ప్రభాతవార్త : అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఆరు సంవత్సరాలుగా టాయిలెట్ల సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా, గ్రామ సర్పంచ్ పాండ్రాల దాము ఆ సమస్యను పరిష్కరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గెలుపొందిన 40 రోజుల్లోనే టాయిలెట్ల నిర్మాణాన్ని పూర్తి చేసి శుక్రవారం విద్యార్థులతో కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.సందర్భంగా ఉపాధ్యాయులు సర్పంచ్ దామును అభినందించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. పదవ తరగతి పరీక్షల్లో మండలంలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి రూ.15 వేలు, పాఠశాలలో మొదటి స్థానం సాధించిన వారికి రూ.5 వేల బహుమతి అందజేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు పాములపర్తి రాజు, గ్రామ కార్యదర్శి నిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధులు విడుదల

గజ్వేల్, మార్చి 13 (ప్రభాతవార్త): రైతులకు పెట్టుబడి సహాయంగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన 22వ విడత నిధులు విడుదలకు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అసోంలోని గౌహతి నుంచి ప్రధాని నరేంద్రమోడి వర్చువల్ మీడియా ద్వారా విడుదల చేశారని ఏడిఏ బాబునాయక్, ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్‌లోని రైతు వేదికలో ప్రధాని నరేంద్రమోడి సందేశాన్ని టివి ద్వారా వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హులైన రైతులకు కేంద్ర వ్యవసాయ శాఖ నుంచి నేరుగా వారి ఖాతాల్లోనే నగదు మొత్తం జమ కానుందన్నారు. 22వ విడతలో సుమారుగా 18,640 కోట్ల రూపాయలు 9.32 లక్షల మంది రైతుల ఖాతాల్లో వివిధ రాష్ట్రాల్లో జమ కానున్నాయన్నారు. ఇప్పటి వరకు 4.09 లక్షల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని, ఈ పెట్టుబడి సహాయం మూడు విడతల్లో రూ.2వేల చొప్పున మొత్తం రూ.6వేలు ప్రతి సంవత్సరం విడుదల చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగరాజు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

రామాయంపేటలో ప్రై డే-డ్రై డే

11వ వార్డు పరిధిలోని మురికికాలును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిల్ సభ్యులు

-ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డుల్లో పరిశీలన
-మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు

రామాయంపేట, మార్చి 13, ప్రభాతవార్త:
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రామాయంపేట మున్సిపాలిటీలో శుక్రవారం 'ఫ్రైడే - డ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్యతోపాటు కౌన్సిల్ సభ్యులు, అధికారులు పట్టణంలోని 11వ వార్డులో పర్యటించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. వీధుల్లో చెత్త నిర్వహణ, మురుగు నీటి పారుదల, డ్రైనేజీ వ్యవస్థ పనితీరును అధికారులు సమీక్షించారు. అవసరమైన చోట తక్షణమే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నిల్వ నీరు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన చెత్త బుట్టల్లోనే వేయాలని ప్రజలకు సూచించారు. సీజనల్ వ్యాధులను నివారించేందుకు ప్రతి శుక్రవారం డ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మున్సిపాలిటీ చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పట్టణ అభివృద్ధికి చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిల్ సభ్యులు గజవాడ నాగరాజు, దాకి శ్యామల స్వామి, దేవుని రంజిత్, బైరం స్వప్న కుమార్, మున్సిపల్ మేనేజర్ రఘువరణ్, ఆర్ఐ బాలకృష్ణ, వార్డు అధికారులు, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దంతేపల్లిలో...

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన...

రామాయంపేట మండలం దంతేపల్లిగ్రామంలో శుక్రవారం డ్రై డే - డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచి మస్కూరి బాలరాజు, పంచాయతీ కార్యదర్శి మాధవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా గ్రామంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచి బాలరాజు గ్రామస్థులకు సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నిల్వ నీరు ఉండకుండా తొలగించాలని, దోమల పెరుగుదలను నివారించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. అలాగే ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఏడుపాయల అభివృద్ధికి వ్రణాళిక

స్థలాన్ని పరిశీలిస్తున్న తనికెళ్ళ ఇంటిగ్రేటెడ్ కన్సల్టెన్సీ సభ్యులు

పాపన్నపేట, మార్చి 13, ప్రభాతవార్త:
ఏడుపాయల వరిపూర్ణ అభివృద్ధికోసం రూ.147కోట్లతో వ్రణాళిక రూపొందిస్తున్నట్లు ఈఓ వీరేశం తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌కుచెందిన తనికెళ్ళ ఇంటిగ్రేటెడ్ కన్సల్టెన్సీ సభ్యులు, స్థలాన్ని పరిశీలించారు. ఏడుపాయల్లో కాటేజీలు, అద్దాల మేడ, క్యూలైన్, ఒడిబియ్యం కౌంటర్, స్టార్ గదులు, బోనాలమంటపం తదితర అభివృద్ధి నిర్మాణాలు చేపట్టేందుకు, మాస్టర్‌ప్లాన్ రూపొందించనున్నట్లు కన్సల్టెన్సీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాధవి, ప్రాజెక్ట్ మేనేజర్ రవి, ఈఓ వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

సదాశివపేట, మార్చి 13, ప్రభాతవార్త:
కంబాలపల్లి గ్రామ సర్పంచి ఇంధూరి భరతమ్మ బాబు ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ చేయటం జరిగింది. ముఖ్య అతిథులు సిడిసి చైర్మన్ గడీల రాంరెడ్డి, రెజింతల్ గ్రామ సర్పంచి ఆశిరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు భీంసేనారెడ్డి, ఉపసర్పంచి కుమ్మరి పార్వతమ్మ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, సభ్యులు ప్రభు, ప్రభాకర్‌రెడ్డి, మునీర్, కృష్ణ, నర్సిములు, సురేష్, దుర్గా, శివ తదితరులు పాల్గొన్నారు.

మేనేజింగ్ డైరెక్టర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్

ఎండి అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న మాజీ కార్పొరేటర్ సింధు

రామచంద్రాపురం, మార్చి 13, ప్రభాతవార్త:
భారతీనగర్‌డివిజన్‌లో అసంపూర్తిగా ఉన్న అండర్‌డ్రైనేజీ పైప్‌లైన్‌పనులపై మాజీకార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి శుక్రవారం హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బి ఎండి అశోక్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకుని వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా మాజీ కార్పొరేటర్ సింధూ మాట్లాడుతూ డివిజన్‌లో ఫెన్సింగ్ ఏరియా, ఎంఐజి కాలనీ ప్రాంతాల్లో అండర్ డ్రైనేజి పెండింగ్ పనులను పూర్తయ్యేలాచేసి ప్రజలు ఉపశమనం పొందేలా చూడాలని ఎండి అశోక్‌రెడ్డికి వివరించామని, స్పందించిన ఎండి అశోక్‌రెడ్డి సంబంధిత అధికారులతో చర్చించి పనులను వేగవంతంగా పూర్తయ్యేలా చొరవ తీసుకుంటామని వివరించారని సింధూ ఆదర్శ్‌రెడ్డి పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన సింధూ ఆదర్శ్‌రెడ్డి...
సింధు ఆదర్శ్‌రెడ్డి శుక్రవారం సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజనను మర్యాదపూర్వకంగా కలుసుకుని డివిజన్‌పరిధిలోని అభివృద్ధి అంశాలపై చర్చించారు. బాంబేకాలనీ రైతుబజార్‌లో దుకాణాల కేటాయించు ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని కమిషనర్ దృష్టికి తీసుకుపోయామని, కమిషనర్ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీచేశారని సింధూ ఆదర్శ్‌రెడ్డి వివరించారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

కుమ్మరి సంఘం సభ్యులు

మెదక్, మార్చి 13, ప్రభాతవార్త:
మెదక్ పట్టణంలో ఈరోజు మొల్లమాంబ 586జయంతిని పురస్కరించుకొని సంఘసభ్యులు కుమ్మరి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ తెలుగులో రామాయణాన్ని మొట్టమొదటిసారిగా రచించిన మహోన్నత వ్యక్తి మొల్లమాంబ. సంస్కృత భాషలోగల 24వేల శ్లోకాలతో 7కాండాలతో ఉన్న రామాయణాన్ని 871శ్లోకాలతో 8కాండాలతో సామాన్యులకు సైతం అర్థమయ్యేలా రీతిలో సంక్షిప్తంగా సరళభాషలో అందరికీ అర్థమయ్యే రీతిలో రచించిన కుమ్మర్ల తొలికవయిత్రి మొల్లమాంబ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘసభ్యులు రాములు, లింగం నరేష్, నాగరాజు, నవీన్, బాలరాజు, అనసూయ, కళావతి, మల్లేశం మొదలగువారు పాల్గొన్నారు.

గుమ్మడిదలలో ప్రారంభమైన ఆధార్‌కేంద్రం సేవలు

గుమ్మడిదల, మార్చి 12, ప్రభాతవార్త:
కొన్ని రోజులుగా ప్రజలు ఎదురుచూస్తున్న ఆధార్‌కేంద్రం సేవలు ఎట్టకేలకు గుమ్మడిదల మున్సిపాలిటీలో ప్రారంభమయ్యాయి. ఆధార్ నమోదు, సవరణలు, మొబైల్ నంబర్ అప్‌డేట్, చిరునామా మార్పులు వంటి సేవలను ఇకపై స్థానికంగా పొందే అవకాశం కలిగింది. ఇప్పటివరకు ఈ సేవల కోసం ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. మున్సిపాలిటీ కార్యాలయం పరిధి ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన ఈ ఆధార్‌కేంద్రం ద్వారా గుమ్మడిదల మున్సిపాలిటీతో పాటు మండల ఇతరగ్రామాల పరిసరప్రాంతాల ప్రజలకు ఎంతో సౌకర్యం కలగనుంది. ఆధార్ కార్డుకు సంబంధించిన వివిధ సేవలు ఒకేచోట అందుబాటులోకి రావడంతో ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు మాట్లాడుతూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఈ కేంద్రం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుమ్మడిదలలో ఆధార్ కేంద్రం

ఘనంగా నల్లపోచమ్మ విగ్రహప్రతిష్ఠ



నల్లపోచమ్మ విగ్రహప్రతిష్ఠలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

గుమ్మడిదల, మార్చి 13, ప్రభాతవార్త:
గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని 1వవార్డు దాసరిగడ్డలో నూతనంగా నిర్మించిన నల్లపోచమ్మ అమ్మవారి ఆలయంలో విగ్రహప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిజిఆర్‌ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి సొంతనిధులతో ఆలయాన్నినిర్మించి ఈ మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. సిజిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి సొంతనిధులతో ఆలయం నిర్మించడంపట్ల స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య, స్థానిక నాయకులు సద్ది విజయ్‌భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి, హుస్సేన్, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

కొండాపూర్, మార్చి 13, ప్రభాతవార్త:
మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శనివారం శంకుస్థాపన చేయనున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం (ఎన్ఆర్ఈజిఎస్) నిధులతో నిర్మించనున్న సిసిరోడ్ల పనులకు ఆయన ప్రారంభం చేయనున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. అనంతసాగర్, సైదాపూర్, మారేపల్లి, శివన్నగూడెం, హరిదాస్‌పూర్, తమ్మలిభాయితండా, మునిదేవుని పల్లి, గుంతపల్లి, గిర్మాపూర్‌తో పాటు మండల కేంద్రం కొండాపూర్‌లో సిసి రోడ్ల నిర్మాణపనులకు శంకుస్థాపన చేయనున్నట్లు స్థానికనాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు విఠల్, పార్టీ ప్రధానకార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, పార్టీనాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు.

తొలి తెలుగు మహిళాకవయిత్రి మొల్ల జయంతి

గుమ్మడిదల, మార్చి 13, ప్రభాతవార్త:
గుమ్మడిదల మండలంలోని కానుకుంట గ్రామంలో కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో తెలుగులో రామాయణం రచించిన మొట్టమొదటి తెలుగు మహిళాకవయిత్రి మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె తెలుగు సాహిత్యానికి అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ ఆమెజీవితం అందరికీ ఆదర్శమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుమ్మరి వెంకటేష్, వార్డ్ మెంబర్ కుమ్మరి పెంటేష్, కె.ప్రభాకర్, కె.వీరభద్రయ్య, కె.శ్రీను, కె.భాస్కర్, గ్రామ అధ్యక్షుడు కె.మహేష్, కె.చింటు తదితర కుమ్మరి సంఘం సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగవైభవంగా శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామివారి బ్రహ్మోత్సవాలు

గుమ్మడిదల, మార్చి 13, ప్రభాతవార్త:

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి...
పటాన్‌చెరునియోజకవర్గం గుమ్మడిదలమున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి, వీరన్నగూడెం వార్డులో శ్రీవీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ సి.అంజిరెడ్డి, వారి సతీమణి, బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, కమిటీసభ్యులతో కలిసి దేవాలయ అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జన్నారం మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, బొంతపల్లి కౌన్సిలర్ గిద్దే విజయలక్ష్మి, దోమడుగు కౌన్సిలర్ రాజిరెడ్డి, పలుగు గోవర్ధన్‌రెడ్డి, రామ్‌రెడ్డి, రాఘవరెడ్డి బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్...
బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి విచ్చేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌ని పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ సన్మానించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, వారి సతీమణి సంగారెడ్డిజిల్లా మహిళా అధ్యక్షురాలు కాట సుధాశ్రీనివాస్‌గౌడ్ హాజరై భక్తులతోకలిసి ఆధ్యాత్మికకార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలుచేసి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాపరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు, చంద్రారెడ్డి, కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలికి ఆస్మా శుభాకాంక్షలు

రాష్ట్ర మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆస్మా

జహీరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:
రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులైన స్వర్ణను శుక్రవారం నియోజకవర్గ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఆస్మా హైద్రాబాద్‌లోని గాంధీ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జహీరాబాద్ నియజకవర్గంలో జరుగుతున్న కార్యక్రమాల గురించి స్వర్ణకు ఆస్మా వివరించారు.

ఉపాధిహామీ కూలీల మహాధర్నా విజయవంతం

మాట్లాడుతున్న సిపిఎం నియకులు రమేష్‌గౌడ్

మునిపల్లి, మార్చి 13, ప్రభాతవార్త:
ఉపాధిహామీ కూలీల డిమాండ్ల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో మునిపల్లి మండలకేంద్రంలో తలపెట్టిన మహాధర్నా విజయవంతం అయింది. వివిధ గ్రామాల నుంచి కూలీలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జయరాజ్, రమేష్‌గౌడ్‌లు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు కొత్త జాబ్ కార్డులు అందజేయాలని డిమాండ్‌చేశారు. పాత పద్ధతిలోనే ఉపాధిహామీ పథకం కొనసాగించాలని, పనిప్రదేశంలో మంచినీళ్లు, టెంట్ సౌకర్యం, మెడికల్ కిట్టు, కూలీలందరికి పనిముట్లు అందజేయాలన్నారు. ఉపాధికూలీలకు పాత బకాయిలు వెంటనే అందజేయాలన్నారు. రెండు సార్లు ఫోటో తీసే విధానాన్ని వెంటనే రద్దుచేయాలని డిమాండ్‌చేశారు.

కప్పాడ్ పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు

ఝరాసంగం, మార్చి 13, ప్రభాతవార్త:
మండలపరిధిలోని కప్పాడ్ గ్రామంలోని హనీపాఠశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు గ్రామస్థులు శుక్రవారం పరీక్షప్యాడ్‌లను అందచేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అందుకోవాలని పాఠశాల కరస్పాం డెంట్ శరణప్ప విద్యార్థులకు సూచించారు. పరీక్షప్యాడ్‌లు అందించిన గ్రామస్థులకు కరస్పాండెంట్ శరణప్ప కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచే పదోతరగతి పరీక్షలు..

-రామాయంపేటలో ఏర్పాట్లు పూర్తి
-మండల విద్యాశాఖ అధికారి అయిత శ్రీనివాస్

రామాయంపేట, మార్చి 13, ప్రభాతవార్త:
నేటి(శనివారం) నుంచి ప్రారంభంకానున్న పదోతరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు రామాయంపేట మండల విద్యాధికారి అయిత శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా మొత్తం ఐదు పరీక్షాకేంద్రాలను ఏర్పాటుచేసి, పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశామని పేర్కొన్నారు.

అందులో రామాయంపేట పట్టణంలో ప్రభుత్వ హైస్కూల్, రెసిడెన్సియల్ పాఠశాల, వివేకానంద విద్యాలయంలో మూడు కేంద్రాలు ఉండగా, మండలపరిధిలోని అక్కన్నపేట జిల్లాపరిషత్ హైస్కూల్, కోనాపూర్ జిల్లాపరిషత్ హైస్కూల్‌లో మరో రెండు పరీక్షాకేంద్రాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మొత్తం 790మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని వెల్లడించారు. కాగా కోనాపూర్ పరీక్షాకేంద్రంలో పొరుగు మండలమైన నిజాంపేట నుండి మరో 26మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్షాకేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, మూత్రశాలలు తదితర మౌలికవసతులు, భద్రతా ఏర్పాట్లు కల్పించామని తెలిపారు.

విద్యార్థులు సమయానికి ముందుగానే పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 8:30గంటల నుంచి 9:35గంటల వరకు మాత్రమే విద్యార్థులను పరీక్షాకేంద్రాల్లోకి అనుమతిస్తామని స్పష్టంచేశారు. ఆలస్యంగా వచ్చే వారికి అనుమతి ఉండదని తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకున్నామని మండల విద్యాధికారి తెలిపారు.

పదవతరగతి పరీక్షాకేంద్రాల వద్ద 163సెక్షన్ అమలు...

ఎస్పి ప్రవీణ్‌రెడ్డి...

పెద్దశంకరంపేట, మార్చి 13, ప్రభాతవార్త:
పదవ తరగతి వార్షిక పరీక్షలు నేటి నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పట్టణంలోని పరీక్షాకేంద్రాల పరిసరాల్లో 100మీటర్ల పరిధి వరకు 163 సెక్షన్ అమలుచేస్తున్నట్లు ఎస్పి ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎస్పి ప్రవీణ్‌రెడ్డి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేకచర్యలు చేపట్టినట్లు చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పరీక్షాకేంద్రాలను పరిశీలిస్తున్న ఎంఈఓ...
పెద్దశంకరంపేట మండలంలో పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మండలవిద్యాధికారి వెన్ను శేఖర్ శుక్రవారం తెలిపారు. పెద్దశంకరంపేటలో రెండు పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, మండలంలో మొత్తం 427మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షకు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. విద్యార్థులకు పరీక్షా కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నిచర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

పరీక్షలకు ఖేడ్‌లో సర్వం సిద్ధం

నారాయణఖేడ్, మార్చి 13, ప్రభాతవార్త:
నేటినుండి జరగనున్న పదవతరగతి పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. శనివారం నుండి ఏప్రిల్ 16 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ప్రతిరోజు 9:30 నుండి 12:30 పరీక్షా జరగనుంది. మండలవ్యాప్తంగా మొత్తం 1550మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని నారాయణ ఖేడ్ విద్యాధికారి విశ్వనాథం తెలిపారు. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా 8కేంద్రాలను ఏర్పాటుచేశామని వారు తెలిపారు. ఎవరైనా పరీక్ష హాల్‌లో ఫోటో తీసినా, ఇతరులకు పంపినా, ఎవరి నుండి లీక్ అయినా విషయం తెలిసిపోయేలా అధికారులు ఏర్పాట్లుచేశారు. ఎవరైనా మాస్ కాపీయింగ్ పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై కఠినచర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

10 పరీక్షలు ప్రశాంతంగా సాగేలా చూడాలి

-ఉపాధ్యాయులకు ఉపతహసీల్దార్ శివకృష్ణ

నాగల్‌గిద్ద, మార్చి 13, ప్రభాతవార్త:
ఈనెల 14వ తారీఖు నుంచి ప్రారంభం అవుతున్న 10వతరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా పూర్తయ్యేలా ఉపాధ్యాయులు తమవంతు సహకారం అందించాలని డిప్యూటీ తహసీల్దార్ శివకృష్ణ, ఎస్ఐ రామకృష్ణ, సిట్టింగ్ స్క్వాడ్ ప్రకాష్‌లు ఉపాధ్యాయులకు సూచించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

సదాశివపేట, మార్చి 13, ప్రభాతవార్త:
సదాశివపేట మండలపరిధిలో నిర్వహించబడనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సక్రమంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మండలవిద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు. ఈ సంవత్సరం మండలంలో మొత్తం 7పరీక్షాకేంద్రాలలో 1209మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, పరీక్షాకేంద్రాలలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయబడినట్లు, సెయింట్ ఆంథోనీ పాఠశాలలో ఏర్పాట్లను సిఎస్ శ్రీనివాసులు, డిఓ భానుప్రకాష్, ఇన్విజిలేటర్స్, ప్రిన్సిపల్, సిఆర్‌పితోపాటు పరిశీలించడం జరిగిందన్నారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, ఇన్విజిలేటర్స్‌ను నియమించడం జరిగిందని, విద్యార్థులు పరీక్షాకేంద్రాలకు కనీసం అరగంట ముందుగా చేరుకోవాలని, హాల్ టికెట్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షాకేంద్రాలకు తీసుకురావద్దని తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అందరి సహకారం కోరుతున్నట్లు మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు.

10వతరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

పుల్‌కల్, మార్చి 13, ప్రభాతవార్త:
ఉమ్మడి పుల్‌కల్ మండలంలో 10వతరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు విద్యాశాఖ అధికారులు తగు ఏర్పాట్లు పూర్తిచేశారు. 881 మంది విద్యార్థులకు 4పరీక్షాకేంద్రాలను అధికారులు ఏర్పాటుచేశారు. మండలంలోని 6జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలతోపాటు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, తెలంగాణ ఆదర్శ, సింగూరు గురుకుల పాఠశాలల్లో 451మంది, చౌటకూరుమండలంలోని 4జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలల్లో 430మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పుల్‌కల్ మండలంలో సింగూరు గురుకులపాఠశాల, తెలంగాణ ఆదర్శపాఠశాలల్లో పరీక్షాకేంద్రాలు, చౌటకూరుమండలంలో చౌటకూరు, శివంపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షాకేంద్రాలను, 2 డిపార్ట్‌మెంట్ అధికారులు, 31మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటుచేశారు. పుల్‌కల్‌లోని 28మంది ఇన్విజిలేటర్లు, నియమించినట్లు విద్యాధికారులు శంకర్, అనురాధలు తెలిపారు.

పిహెచ్‌సిలో స్పెషలిస్ట్ వైద్యశిబిరం

-జిల్లా వైద్యాధికారి డా.శ్రీరామ్ సందర్శన

పేషంట్‌లతో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఓ

రామాయంపేట, మార్చి 13, ప్రభాతవార్త:
రామాయంపేట మండలంలోని ప్రగతిధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక వైద్య నిపుణుల శిబిరం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99రోజుల ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ స్పెషలిస్ట్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్‌ఓ) డాక్ట